www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 ఫిబ్రవరి 2025



12, 13 తేదీల్లో బధిరుల టి-20 క్రికెట్ పోటీలు

భీమవరం టౌన్: భీమవరంలో ఈ నెల 12, 13 తేదీల్లో వెస్ట్ గోదావరి జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ రాష్ట్రస్థాయి మూగ, చెవుడు (బధిరుల) టి-20 క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి, అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీకృష్ణంరాజు, సిహెచ్.తాతారావు, గన్నాబత్తుల తులసమ్మ పెదరాశ ఛారిటబుల్ ట్రస్ట్ గన్నాబత్తుల శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక వెంకట్రామ థియేటర్ వద్ద పోటీల బ్రోచర్, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమవరం గన్నాబత్తుల క్రీడ మైదానంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 10 టీమ్‌లు పాల్గొంటున్నాయన్నారు. విజేతలకు క్రీడేషులు వేలూరి సూర్య భాస్కరరావు కుమారుల సౌజన్యంతో ట్రోఫీ, బహుమతులు అంది స్తున్నామని తెలిపారు. డిఎన్ఆర్ కళాశాల యాజమాన్యం పూర్తి సహకారం అంది స్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు టి.రాము, ఎమ్‌డి.రఫీ,పాల్గొన్నారు.

కోడ్ అమలు ఇలాగేనా..!

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనవరి 29 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమల్లోకి వచ్చి పది రోజులు గడిచిపోతున్నా ఇప్పటికీ పట్టణాలు, పల్లెల్లో అధికార పార్టీ ఎంఎల్‌ఎ, ఎంపిలతో కూడిన ఫ్లెక్సీలను, బోర్డులను తొలగించడంగాని, ముసుగు వేయడంగాని చేయని పరిస్థితి నెలకొంది. అసలు ఎన్నికల కోడ్ అమలులో ఉందా అనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి.

- పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికారుల నిర్లక్ష్యం
- గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో యథేచ్ఛగా రాజకీయ నేతల ఫ్లెక్సీలు, పోస్టర్లు
- ఎంఎల్‌ఎ, ఎంపీల ఫ్లెక్సీల జోలికెళ్లేందుకు అధికారుల వెనుకంజ
- అధికారుల తీరుపై విమర్శలు వెల్లువ
- ఎన్నికలు సజావుగా సాగేనా అంటూ చర్చ


కూటమి ప్రభుత్వ అధినేతల ఫొటోలతోపాటు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఎంపి పుట్టా మహేష్‌తో కూడిన ఫ్లెక్సీ


ఎంపీతోపాటు దెందులూరు, చింతలపూడి ఎంఎల్ఎలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు నగరంతోపాటు దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం విజయరాయి, నడిపల్లి, రామచంద్రపురం, రాయన్నపాలెం వంటి గ్రామాల్లో ఇప్పటికీ స్థానిక ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఎంపి పుట్టా మహేష్‌కుమార్, సిఎం, డిప్యూటీ సిఎం ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు పెద్దఎత్తున అలానే ఉన్నాయి. ఇక్కడే కాదు.. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇతర నియోజకవర్గాల్లోనూ చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. జనవరి 29న తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. వెంటనే ఏలూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి మీడియా సమావేశం ఏర్పాటు చేసి పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. షెడ్యూల్ విడుదల రోజు నుంచి కోడ్ అమల్లోకి వచ్చినట్లు ప్రకటించారు. మార్చి మూడో తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈ నెల 10వ తేదీ సోమవారంతో నామినేషన్ల ప్రక్రియ సైతం ముగియనుంది. ఇప్పటి వరకూ 20 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఎన్నికలు సజావుగా సాగాలంటే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) సక్రమంగా అమలు కావాలి. లేకపోతే అధికార పార్టీకి చెందిన నేతలతోపాటు ఇతర శక్తులు ఇష్టానుసారంగా రెచ్చిపోయే అవకాశం ఉంది. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు వేయడం, రాజకీయ నేతల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించడం చేయాలి. కోడ్ అమల్లోకి వచ్చి పది రోజులు దాటినా ఇప్పటికీ ఆ ప్రక్రియను అధికారులు పూర్తి చేయలేదు. ఏలూరు పట్టణంలో రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేసినప్పటికీ హోర్డింగులు వంటి వాటిని పూర్తిస్థాయిలో తొలగించలేదు. ఇక గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. సొసైటీలు, సచివాలయాల ముందు సైతం పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఇప్పటికీ అలానే ఉన్నాయి. ఎంఎల్‌ఎ, ఎంపీల ఫ్లెక్సీల జోలికెళ్లేందుకు అధికారులు వెనుకాడుతున్న పరిస్థితి ఉంది. ఎన్నికల కోడ్ అమలులో అధికారుల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



ఏలూరు కలెక్టరేట్ వద్ద సిఎం చంద్రబాబు ఫొటోతో కూడిన బోర్డు

ఎన్నికలు సజావుగా నిర్వహించేనా..?

ఎన్నికల కోడ్ అమలులో తీవ్ర నిర్లక్ష్యం నెలకొనడంతో ఎన్నికలు దగ్గరపడే కొద్ది పరిస్థితి ఏవిధంగా ఉంటుందనే చర్చ జనాల్లో నెలకొంది. మా గ్రామంలో పోస్టర్లు, ఫ్లెక్సీలు అలానే ఉన్నాయంటూ ఒకరికొకరు ఫోన్లు చేసుకుని మాట్లాడుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో అధికార టిడిపి తమ అభ్యర్థిని బరిలో నిలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలైంది. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి ఓటమి చెందితే ప్రభుత్వ పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పటికే సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులు గట్టి పోటీదారుగా ఉన్నారు. 2019 మార్చిలో జరిగిన ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఇక్కడ పిడిఎఫ్ అభ్యర్థి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) గెలిచిన సంగతి అందరికీ తెలిసిందే. ఎంఎల్‌సి ఎన్నికల్లో తొలిసారి పిడిఎఫ్ అభ్యర్థి కచ్చా జార్జి విక్టర్ గెలుపొందారు. దీంతో తమ సర్వశక్తులు ఒడ్డి పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని టిడిపి, కూటమి నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంఎల్‌ఎలకు, నియోజకవర్గ పరిశీలకులకు బాధ్యతలు అప్పగించారు. వారంతా నియోజకవర్గాల్లో కలియ తిరుగుతున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగే పరిస్థితి కన్పిస్తోంది. ఇప్పుడే ఎన్నికల కోడ్ సరిగా అమలు చేయని అధికారులు, ఎన్నికలు సజావుగా నిర్వహిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఎన్నికల కోడ్ అమలులో అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని అంతా కోరుతున్నారు. కోడ్ ఉల్లంఘనలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదులు ఇచ్చేందుకుసైతం చాలామంది సిద్ధమవుతున్నారు.

తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించి, తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేయాలన్నారు. వీటికి సంబంధించి చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలను అందజేసి, త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అన్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా అధిక నీటి ఎద్దడి పరిస్థితులు లేకపోయినప్పటికీ ఈ వేసవిలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు సరిపడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళికలను రూపొందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలతోపాటు రూరల్ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరందించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వాతావరణ శాఖ అంచనాల మేరకు ఈ సంవత్సరం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, తాగునీటి చెరువులకు అవసరమైన నీటిని ఎప్పటికప్పుడు నింపుకుని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో నీటిఎద్దడి అనేది ఎక్కడ ఉండకూడదని, కాలువలు కట్టేసే సమయం ఇంకా ఉన్నందున అన్ని ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నేతలు

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

ప్రజాశక్తి - తణుకు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విమర్శించారు. శనివారం స్థానిక బ్యాంక్ కాలనీలో సిఐటియు ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దహనం చేసి నిరసన తెలిపారు. పేదలపై భారాలు వేసే బడ్జెట్‌ను వ్యతిరేకించండి, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, సంక్షేమ పథకాలకు నిధులు పెంచాలని పెద్దత్తున నినదించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బడ్జెట్ కార్పొరేట్లకే అనుకూలంగానే ఉందన్నారు. పేదలను కొట్టి గెద్దలకు పెట్టేవిధంగా బడ్జెట్ ఉండటం బాధాకరమన్నారు. పట్టణాలలో ఉపాధి హామీ చట్టం అమలు చేసి పనులు చూపాలని కోరారు. స్కీమ్ వర్కర్లకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి, రిటర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు పరం చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు, గుబ్బల గోపీ, శ్రీనివాస్, బాబు, మురళి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు బాసటగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు

పట్టభద్రుల ఎంఎల్‌సిగా దిడ్ల వీర రాఘవులును గెలిపించండి - ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, బొర్రా గోపీమూర్తి


జంగారెడ్డిగూడెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి డి.వి.రాఘవులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిరంతరం ప్రజల మేలు కోసం శాసనమండలిలో పోరాడుతూ ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలుస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన కృషి చేస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులు గెలుపు కోరుతూ కార్యకర్తల సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ అధికారంలో ఎవరున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, నిర్వాసితులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇలా అన్ని తరగతుల ప్రజల గొంతుకగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు పని చేస్తున్నారని గుర్తు చేశారు. శాసనమండలిలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలకు ఒక ప్రత్యేకస్థానం, గుర్తింపు ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తానని, డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తానని ఎన్నో ఆశలు చూపించి ఓట్లు దండుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలైనా నిరుద్యోగులకు, ఉద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపిందన్నారు. అందుకే ప్రశ్నించే గొంతుకలను గెలిపించడం ద్వారానే ప్రజలకు న్యాయం జరుగుతుందని, దానికి పిడిఎఫ్ ఎంఎల్‌సిలే సరైన వారని వారు స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎంఎల్‌సిగా బరిలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులను గెలిపించి గ్రాడ్యుయేట్ ఓటర్లు మరోసారి చరిత్ర సృష్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులు, యుటిఎఫ్ నేతలు రవికుమార్, ముస్తఫా ఆలీ, సిఐటియు ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, మహిళా నేత టి.నాగ మణి, నేతలు టి.రామకృష్ణ, జ్యోతిబసు, సుభాషిణి పాల్గొన్నారు.

నాటిక పోటీల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ


పాలకొల్లు నాటక పరిషత్ కరపత్రాలను విడుదల చేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు

మార్చి 15, 16, 17 తేదీల్లో నిర్వహించే పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యాన 16వ జాతీయస్థాయి నాటికల పోటీల ఆహ్వాన పత్రిక శనివారం ఆవిష్కరించారు. పరిషత్ అధ్యక్షుడు కెవి.కృష్ణవర్మ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి గౌరవాధ్యక్షులు మేడికొండ శ్రీనివాసరావుచౌదరి, ఉపాధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మకు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణవర్మ మాట్లాడుతూ కళలకు నిలయమైన పాలకొల్లులో నాటక పరిషత్ ఆరు దశాబ్దాలుగా నాటక పోటీలు నిర్వహిస్తూ నాటక రంగానికి ఎనలేని సేవలు అందించాయన్నారు. అదే స్ఫూర్తితో పాలకొల్లులో గత 16 సంవత్సరాలుగా నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సంఘ కార్యదర్శి జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ నాటిక పోటీలు బస్టాండ్ సెంటర్‌లోని అడబాల థియేటర్స్ వెనుక ఖాళీ స్థలంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ, కోశాధికారి కొణిజేటి గుప్త, షేక్ పీర్ సాహెబ్, నడపన శ్రీనివాసరావు, జిఎస్ఎన్.రవి, రెడ్డి వాసు, సోమంచి శ్రీనివాస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఇదేం తీరు..!

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి మండల కేంద్రాలైన వేలేరుపాడు, కుక్కునూరులో గ్రామ సభలు నిర్వహించారు. అయితే గ్రామసభల నిర్వహణ తీరుపై అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలు, జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణ, హెల్మెట్ ధారణ వంటి అంశాల్లో అధికారుల తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది.

జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఇచ్చిన హామీకి అనుగుణంగా విలీన మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులో గ్రామసభలు నిర్వహించారు. రెండింటికీ ఐటిడిఎ పిఒ రాములునాయక్ హాజరయ్యారు. ఈ సభకు వందలాది మంది పోలవరం నిర్వాసితులు తరలొచ్చారు. అయితే 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాల నిర్వాసితుల నుంచే వినతులు స్వీకరిస్తామని పిఒ చెప్పడంతో అక్కడికి చేరుకున్న వారంతా తీవ్ర నిరాశ, ఆందోళనకు గురయ్యారు. ఇదేంటని ఆందోళన చేపట్టడంతో ఎట్టకేలకు దిగొచ్చిన పిఒ వినతులు స్వీకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామనడంతో అంతా శాంతించారు. ఇదే పరిస్థితి మరుసటి రోజు కుక్కునూరులోనూ చోటుచేసుకుంది. నిర్వాసితులంతా తమ గోడు మరోసారి వినతిపత్రాల రూపంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 2022 గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకుని మండలం యూనిట్‌గా తీసుకుని పరిహారం ఇవ్వాలనేది నిర్వాసితుల ప్రధాన డిమాండ్. దీంతోపాటు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా ఇక్కడి నుంచే తరలించే రోజే కటాఫ్ తేదీగా పరిగణించి పరిహారం ఇవ్వాలని, మిగులు భూములు, పోడు భూములకు పరిహారం ఇవ్వాలనేవి వారి కోరికలు. అలాగే పునరావాస కాలనీల్లో వసతులు కల్పించాలని, ఉపాధి చూపాలనేది వారి ఆకాంక్ష. ఏదేమైనా గతానికి భిన్నంగా నిర్వాసితుల వినతులు స్వీకరించడం అభినందనీయమే. అయితే నిర్వాసితుల ప్రధాన డిమాండ్లపై అధికారులకన్నా ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గ్రామసభల్లో వచ్చిన అంశాల ఆధారంగా ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అలాకాకుండా పాతపద్ధతిలోనే వ్యవహరిస్తే గ్రామసభ లక్ష్యం నెరవేరదు. పైగా కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం మండలం యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లించాలని నిర్వాసితులంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచిచూడాలి.



పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అదే సమయంలో కూటమి తరపున బరిలోకి దిగుతున్న పేరాబత్తుల రాజశేఖరం తరపున టిడిపి శ్రేణులు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే వారికి ఉద్యోగులు, నిరుద్యోగుల నుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టమవుతోందని బహిరంగ రహస్యం. ప్రధానంగా ఎనిమిది నెలల కాలంలో ఎన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చారు. డిఎస్‌సి నిర్వహణలో జాప్యమేంటి అని, కనీసం నిరుద్యోగ భృతి అమలు ఎప్పుడు అని నిరుద్యోగులు ప్రశ్నిస్తుంటే టిడిపి నేతలు నీళ్లు నములుతున్నారు. ఇక ఉద్యోగులైతే డిఎలు, బకాయిలపై అడుగుతుంటే సమాధానం చెప్పలేక అధికారదర్పం ప్రదర్శిస్తూ స్థానికంగా చేయగలిగేవి తాము చేస్తామని, మిగిలినవి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి చేయిస్తామని, ఏదేమైనా తమ అభ్యర్థికే ఓటు వేయాలని హుకుం జారీ చేస్తున్నారు. ఈ పనుల్లో ఎంపీలు, ఎంఎల్‌ఎలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగడం గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆలోచనల్లో పడేసిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇదే క్రమంలో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు తరపున పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల నేతలు విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. ప్రధానంగా శాసనమండలిలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ప్రజల గొంతుకగా ఎలా వ్యవహరిస్తున్నారు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలను గెలిపిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, ప్రజలకు చేకూరే ప్రయోజనం ఏమిటి అనేది వివరిస్తుండటం అందరినీ ఆకర్షిస్తోంది. పిడిఎఫ్ తన ప్రచారంలో చేసిన కృషి, దేనికోసం భవిష్యత్తులో నిలబడి పోరాడతారో చెబుతుంటే.. కూటమి ప్రచారం దానికి భిన్నంగా అధికార దర్పంతో సాగుతోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. దీనికితోడు కోడ్ అమలు చేయనీయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోడ్ అమలులోనూ కూటమి ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్ల పట్ల అధికారులు సైతం ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని అధికారుల వ్యవహారశైలిపై 'ఇదేం తీరు' అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్


ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు ఆలోచనలకు పదును పెట్టాలి

నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెడితే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చని నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు సూచించారు. నిట్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉల్కన్ జీ కల్చరల్ ఫేస్ట్ 2కె25 కార్యక్రమం శనివారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రమణారావు మాట్లాడుతూ దేశాన్ని నడిపించే సాంకేతికత రథసారథులు విద్యార్థులేనని తెలిపారు. వినూత్న ఆలోచనలు అంకురించడానికి విద్యాలయాలు చక్కటి వేదికలని చెప్పారు. చదువుతో పాటు ఆటలైనా, పాటలైనా, కళలైనా మనసుపెట్టి నిరంతరం సాధన చేస్తే లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని సూచించారు. విజ్ఞానం, వినోదం కూడా ముఖ్యమేనని తెలిపారు. విద్యార్థులు అవకాశాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. నూతన సాంకేతికతలపై పట్టు సాధించడంతోపాటు దేశం గర్వించే పరిశోధనలను చేపట్టాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తి, సామర్థ్యాలను పెంచుకోవాలని చెప్పారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలు ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేలా ఉండాలని వివరించారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో సభా ప్రాంగణం పరవశించిపోయింది. ఉదయం విద్యార్థులు నిర్వహించిన ఉల్కన్ జీ కార్యక్రమాలను తిలకించేందుకు గూడెం చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ కె.హిమబిందు, డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ తలారి రేష్మా, ఆచార్యులు రాజేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ

డ్రోన్‌తో రైతులు మందుల పిచికారీ

ప్రజాశక్తి - తణుకు రూరల్



డ్రోన్ సాయంతో మొక్కజొన్న తోటలో మందు పిచికారీ

వ్యవసాయంలో రైతులు టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు. నాట్లతో మొదలై క్రిమిసంహారక మందులు స్ప్రే చేయడం, పంటనుకోయడం ఇలా అన్ని విషయాల్లో రైతులు కూలీల కొరతను అధిగమించేందుకు టెక్నాలజీని వినియోగించుకుంటున్నారు. తణుకు మండలంలో ఓ రైతు శనివారం మొక్కజొన్న తోటకు డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందును స్ప్రే చేయించారు. ప్రభుత్వం సబ్సిడీపై పనిముట్లు, యంత్రాలను రైతులకు సరఫరా చేస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వం అన్ని రంగాల్లో డ్రోన్ల వినియోగించాలని ప్రోత్సహిస్తోంది. ఇటీవల విజయవాడలో వచ్చిన వరదలకు డ్రోన్ల ద్వారా బాధితులకు ఆహారం, మందులు సరఫరా చేసింది. అదేవిధంగా రైతులకు పది అడుగుల ఎత్తులో ఉన్న మొక్కజొన్న తోటకు ముందు పిచికారీ చేయడానికి డ్రోన్‌ను ఉపయోగించారు. డ్రోన్ సామర్థ్యం 10 లీటర్లు కాగా 10 లీటర్లకు రూ.450 చొప్పున మూడు ఎకరాల చేనుకు రూ.900 ఖర్చు చేశారు. అదే వరి చేనుకు రూ.400 ఖర్చవుతుందని డ్రోన్ యజమాని చెబుతున్నారు. ఈ డ్రోన్ సాయంతో స్ప్రే చేయడం వల్ల క్రిమిసంహారక మందు ప్రతి ఆకుపై పడుతుందని రైతులు చెబుతున్నారు.

8వ రోజుకు డిఎస్‌సి శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో మంత్రి రామానాయుడు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిఎస్‌సి ఉచిత శిక్షణ తరగతులు శనివారానికి 8వ రోజుకు చేరాయి. ఈ తరగతులను మంత్రి రామానాయుడు సందర్శించారు. అవనిగడ్డ ప్రగతి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పూర్ణ సారథ్యంలో ఉదయం నుంచి ఎస్‌జిటి, అన్ని సబ్జెక్టుల నిరుద్యోగ యువతీ యువకులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉమ్మడి బోధనా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడారు. సిఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తొలి సంతకం చేస్తారని, ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ ముగియగానే డిఎస్‌సి నిర్వహించి వచ్చే విద్యా సంవత్సరంలో, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తారని తెలిపారు.



సాయం అందజేస్తున్న సభ్యులు

విద్యార్థి కుషాల్‌కు రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌వి ఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఎస్.కుషాల్ ఈశ్వర్ ఇటీవల గాయాలపాలైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సర్వోవర్ సొసైటీ తరపున సేకరించిన రూ.10 వేలను విద్యార్థి హాస్పిటల్ ఖర్చు నిమిత్తం హెచ్‌ఎం.రాయపూడి భవాని మిత్రుల సమక్షంలో విద్యార్థి తండ్రి దుర్గారావుఎ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు గుబ్బల భగవాన్, నేతల శ్రీనివాస్‌రావు, ఖండవల్లి మోహన్‌రావు, మామిడిపల్లి అన్న ప్రశాంత్ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పేరుపాలెం సౌత్‌లో వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని గొన్నాబత్తుల ఛారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ గొన్నాబత్తుల నందిని వెంకటప్రసాద్ తెలిపారు. మండలంలోని పేరుపాలెం సౌత్‌లో గొన్నాబత్తుల కళ్యాణ వేదికలో వైద్యులు గొన్నాబత్తుల వెంకటప్రసాద్ పుట్టినరోజున పురస్కరించుకుని రెండు రోజులు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్పొరేట్ వైద్యులతో ఇక్కడ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యుడు వెంకట ప్రసాద్ పుట్టినరోజును పురస్కరించుకుని ప్రతి సంవత్సరమూ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌కు చెందిన వైద్యులతో అందించడం లక్ష్యంగా శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో వైద్యులు బి.పూజ, ఎం.పూజ, జనరల్ వైద్యులు ఆదిత్య, అభిలాష్, చంద్ర కిరణ్, అఖిల, ఆర్థోపెడిక్ వైద్యులు శ్రావణ్ కుమార్ శ్రీకాంత్ ప్రజలను పరీక్షించి సేవలందించారు. అవసరాన్ని వారికి ఉచితంగా మందులు అందించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మేళం బన్ను, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో మన్యం బంద్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించే 'మన్యం బంద్'ను జయప్రదం చేయాలని ఆదివాసీ, ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో జరిగిన పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, పిడిఎస్‌యు జిల్లా నాయకులు వినోద్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు, రైతుసంఘం మండల అధ్యక్షులు వెట్టి వీరయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం అడ్డుగా ఉన్నాయని అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించడం దారుణమన్నారు. ఆ చట్టాలను సవరణ చేయడం ద్వారా పెట్టుబడులు ఆకర్షించి పర్యాటక రంగం అభివృద్ధి చేయొచ్చని, ఆ చట్టాలను సవరణ చేయాలని అనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. అయ్యన్నపాత్రుడు తక్షణం తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, గిరిజనులకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే మన్యం బంద్‌లో ఆదివాసీ, ప్రజాసంఘాలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని, ఏజెన్సీ ప్రాంతంలోని వర్తక, వాణిజ్య, వ్యాపార సంఘాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మడకం పోచమ్మ, మడకం శ్రీదేవి, సోయం శ్రీను, పూనెం శేఖర్, నాగమణి, మడివి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో ఆరోగ్య కేంద్రం భవనం స్లాబ్



ఆచంట వేమవరంలో అసంపూర్తిగా ఉన్న నూతన ఆసుపత్రి

అసంపూర్తిగా ఆచంట వేమవరం పిహెచ్‌సి..!

నిధుల లేమితో నిలిచిన పనులు - శిథిలావస్థ భవనంలోనే బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు

ప్రజాశక్తి - ఆచంట

పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తామని ప్రకటన గుప్పిస్తున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోందని ప్రజలు వాపోతున్నారు. మండలంలో ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరుకున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. ఈ నేపథ్యంలో పిహెచ్‌సికి వెళ్లాలంటే రోగులు భయపడుతున్నారు. ఇక ఉద్యోగుల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఈ ఆరోగ్య కేంద్రానికి ఆచంట వేమవరం, పెనుమంచిలి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు వస్తుంటారు. ఈ తరహాలో ఈ ఆసుపత్రికి వెళ్లాలంటే రోగులు హడలెత్తిపోతున్నారు. దీనికి కారణం భవనం స్లాబ్ పెచ్చులూడి ఇనపఊచలు బయటకు కనిపిస్తూ ఆయా గ్రామస్తులను భయపెడుతోంది. చినుకు పడితే చాలు పిహెచ్‌సి వర్షపు నీటితో తడిసి ముద్దవుతోంది. రికార్డులు, మందులు, సామగ్రి తడిసిపోతున్నాయి. భవనం గోడలు పలుచోట్ల బీటలు వారాయి. కిటికీలు, సన్‌సైడ్‌లు పూర్తిగా పాడయ్యాయి. భవనంపై పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. దీంతో వైద్య సిబ్బంది ఆరోగ్య కేంద్రంలో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

అయితే ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పిహెచ్‌సి పక్కనే గత వైసిపి ప్రభుత్వంలో కోటి రూపాయలతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. సుమారు 80 శాతం వరకూ పనులు పూర్తికాగా, మరో 20 శాతం పనులు నిధుల లేమితో మధ్యలోనే నిలిచిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులు లేక పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు.

ఫార్మాసిస్ట్ పోస్ట్ ఖాళీ..

ఆచంట వేమవరం ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్ట్ పోస్టు భర్తీ కాలేదు. దీంతో రోగులకు సరైన మందులిచ్చేవారు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా ఆస్పత్రి సిబ్బంది టాబ్లెట్లు ఇచ్చి కాలం వెళ్లబుచ్చుతున్నారు. ముఖ్యంగా స్లీపర్ పోస్టు ఖాళీగా ఉండడంతో వైద్య సిబ్బందే తుడుస్తున్న పరిస్థితి. ఆరోగ్య కేంద్రానికి నైట్ వాచ్‌మెన్ లేకపోవడం అది కూడా వైద్య సిబ్బంది నిర్వహించాల్సి వస్తోందని వాపోతున్నారు. పిహెచ్‌సి చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో పశువులు, కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయని వాపోతున్నారు. ఆస్పత్రి పరిసర ప్రాంతం అపరిశుభ్రంగా పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో పాములు తేళ్లు భయపెడుతున్నాయని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ చొరవ తీసుకుని అసంపూర్తిగా నిలిచిపోయిన కొత్త భవనానికి నిధులు మంజూరు చేసి, ఆ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి

అట్లూరి పూజ, వైద్యాధికారి, ఆచంట వేమవరం



ఆచంట వేమవరంలోని పిహెచ్‌సి శిథిలావస్థకు చేరింది. పక్కనే నిర్మిస్తున్న కొత్త భవనం పనులు సుమారు 80 శాతం పూర్తయ్యాయి. నిధులు లేక అసంపూర్తిగా మిగిలిపోయింది. ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి బాత్ రూములు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాంపౌండ్ వాల్ లేక రాత్రి సమయాల్లో సిబ్బంది భయపడాల్సిన పరిస్థితి. పిహెచ్‌సిలో 70 మంది వరకూ ఓపి ఉంటుంది. నెలకు 4, 5 ప్రసవాలు చేస్తున్నాం. నిధులు మంజూరు చేసి ఆసుపత్రిని పూర్తి చేయాలి. అలాగే ఫార్మాసిస్టు, నైట్ వాచ్‌మెన్, స్లీపర్ పోస్టులు భర్తీ చేయాలి.

విద్యార్థులకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు వేయాలి

ప్రజాశక్తి - ఉండి



మాట్లాడుతున్న ఎంపిడిఒ రవీంద్ర

జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో బి.సాయిచంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి రవీంద్ర మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల బాలబాలికలకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు మింగేలా చూడాలని ఎఎన్‌ఎంలకు ఆయన సూచించారు. నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనత సమస్యను తగ్గించొచ్చని తెలిపారు. ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 5,171 మంది చిన్నారులు ఉన్నారని, వారికి ఈ నెల పదో తేదీన ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కొన్ని కారణాల వల్ల మాత్రలు పొందలేని వారికి ఈ నెల 17వ తేదీన అందేలా సంబంధిత అధికారులు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ విస్తరణాధికారి సిహెచ్ వెంకట్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి ఆర్.కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరు: పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న నులిపురుగుల మాత్రల పంపిణీని ఆయా గ్రామాల వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్‌వి.రంగంనాయుడు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించే నులిపురుగులు మాత్రల పంపిణీ కార్యక్రమంపై శనివారం పిహెచ్‌సిలో వైద్య సిబ్బందికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 48 అంగన్వాడీ కేంద్రాల్లో 1546 మంది చిన్నారులకు, 56 పాఠశాలల్లో చదువుకుంటున్న 7852 మంది విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను తప్పనిసరిగా వేయాలన్నారు. సోమవారం మిగిలిపోయినవారికి ఈ నెల 17వ తేదీన మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో మరో వైద్యురాలు స్వర్ణ నిరంజని, సిహెచ్‌వి.సత్యనారాయణ, పిహెచ్‌ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు శంకర్, అమ్మాజీ. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజశేఖరంను గెలిపించాలి : ఎంఎల్‌ఎ

నరసాపురం: పట్టభద్రుల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని గొంది, చిట్టవరం గ్రామాల్లో శనివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ఎంఎల్‌ఎ నాయకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఓటర్ల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ గుత్తుల సాయి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి గూడెం నియోజకవర్గకన్వీనర్ వలవల మల్లిఖార్జునరావు, వాసవీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు కోరారు. కళాశాల పాలకవర్గ సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల హక్కులపై పోరాడతా

ఎంఎల్‌సి అభ్యర్థి బొమ్మిడి సన్నీ రాజ్

భీమవరంటౌన్: ప్రజాస్వామ్యంలో అందరూ సమానమైనప్పటికీ, నేటికీ తమ హక్కుల కోసం ఎంతమంది పోరాడుతున్నారని అలాంటి వారి పక్కన ప్రజల హక్కుల పైన పోరాడతానని ఉభయగోదావరి జిల్లాల పట్టబద్రుల స్వతంత్ర ఎంఎల్‌సి అభ్యర్థి బొమ్మిడి సన్నీరాజు అన్నారు. శనివారం స్థానిక జంక్షన్ రైల్వే స్టేషన్ రోడ్ లో ఉన్న ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అనంతరం ఎన్నికల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొమ్మిడి సన్నీ రాజ్, బొమ్మిడి వెంకటేశ్వరరావు, బొమ్మిడి నారాయణరావు పాల్గొన్నారు.

దాడి కేసులో పలువురిపై కేసు

నరసాపురం: ఇరుగ్రూపులు ఒకరిపై మరొకరు దాడిచేసుకున్న సంఘటనలో నాలుగు కేసులు నమోదు చేశామని సిఐ బి.యాదగిరి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని 29వ వార్డులో జరిగిన ఇరుగ్రూపుల దాడిలో పలువురు ఇచ్చిన ఫిర్యాదులు మేరకు నాలుగు కేసులో సుమారు 52 మందిపై కేసులు నమోదు చేశామని సిఐ తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

ఏలూరు అర్బన్: 2025-26 విద్యా సంవత్సరానికిగాను జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలు శనివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు 9 వ తరగతికి నాలుగు పరీక్షా కేంద్రాల్లో 1007 మంది విద్యార్థులకుగాను 302 మంది హాజరయ్యారని, 705 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. 11వ తరగతికి రెండు పరీక్షా కేంద్రాల్లో 653 మంది విద్యార్థులకుగాను 189 మంది హాజరయ్యారని, 464 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. డిఇఒ రెండు పరీక్షా కేంద్రాలను, పెదవేగి నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఆరు పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆరు పరీక్షా కేంద్రాలను సందర్శించారని ఆమె తెలిపారు.



నరసాపురంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

నరసాపురంలో పోలీస్ పికెట్

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 29వ అరుంధతీపేటలో శుక్రవారం రెండు గ్రూపులకు చెందిన వారు రాళ్లు, కర్రలతో దాడి చేసుకున్న విషయం తెలిసిందే. ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకోవడంతో 144 సెక్షన్ అమలు చేశారు. కాలనీలో పరిస్థితి సాధారణ స్థితికి వచ్చేవరకూ పోలీస్ పికెట్ కొనసాతుందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా పలు ప్రాంతాల్లో పికెట్‌లు ఏర్పాటు చేశామని డిఎస్‌పి జి.శ్రీవేద తెలిపారు. శనివారం పలు సెంటర్లలో పోలీసులు, స్పెషల్ బలగాలు మోహరించాయి. డిఎస్‌పి ఆ ప్రాంతాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఘనంగా సత్తెమ్మ జాతర

ప్రజాశక్తి - ఉండి

మండలం పెదపుల్లేరు గ్రామదేవత సత్తెమ్మ అమ్మవారి జాతర శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కలిదిండి రామకృష్ణంరాజు (పెత్తందారి కృష్ణంరాజు) ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కలిదిండి రామకృష్ణంరాజు (పెత్తందారి కృష్ణంరాజు) అధ్యక్షతన ఆలయ కమిటీ ప్రతినిధులు తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు కలిదిండి రామకృష్ణంరాజు, కలిదిండి నరసింహరాజు, కలిదిండి భాస్కర్ రాజు, కలిదిండి వెంకట సత్యనారాయణ రాజు పర్యవేక్షించారు.

వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

చెరువు లీజు డబ్బులు అడగ్గా చెరువు యజమాని అయిన మహిళపై లీజుదారుడు అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా దాడి చేసి గాయపరిచిన సంఘటనలో వ్యక్తిపై ఉండి పోలీస్ స్టేషన్లో శుక్రవారం రాత్రి కేసు నమోదైంది.దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం గాజువాకకు చెందిన పల్లా లలితా దేవికి ఉండి మండలం వాంద్రం గ్రామంలో నాలుగు ఎకరాల ఆక్వా చెరువు ఉండగా దాన్ని వాంద్రం గ్రామానికి చెందిన మత్తే రాజ్ కుమార్‌కు లీజుకు ఇచ్చింది. అయితే రాజ్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా సాగు చేయకుండా వదిలేశాడని, సంవత్సరం నుంచి లీజు డబ్బులు ఇవ్వడం లేదని, లీజు డబ్బులు రాజ కుమార్ ను అడగ్గా అసభ్య పదజాలంతో దూషించి తనపై దాడి చేశాడని, అడ్డుగా వెళ్లిన తమ బంధువు కందుల బలరాంపై కూడా దాడి చేశాడని లలితా దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు మధ్య రాజ్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బియ్యపుతిప్ప రేవు వద్ద బందోబస్తు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని బియ్యపుతిప్ప రేవు వద్ద కొన్నేళ్ల క్రితం అంతర్వేది తిరునాళ్లకు వెళ్తూ పడవ బోల్తా కొట్టి యాత్రికులు మృతి చెందిన విషయం తెలిసిందే. అంతర్వేది తిరునాళ్లకు పడవలపై ప్రజలు వెళ్లకుండా గడిచిన కొన్నేళ్లుగా ఏటా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం బియ్యపుతిప్ప రేవు వద్ద మొగల్తూరు అడిషనల్ ఎస్‌ఐ వై.నాగలక్ష్మి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. 24 గంటలు సీసీ కెమెరాలతో పోలీసులు మోనిటరింగ్ చేస్తూ గస్తీ కాస్తున్నారు.



బియ్యపు తిప్ప రేవు వద్ద పోలీసులు

స్మార్ట్ మీటర్లు ఆపండి : సిపిఎం

ప్రజాశక్తి - వీరవాసరం

గత వైసిపి ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగా నరసింహమూర్తి విమర్శించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో పోతుల మృత్యుంజయ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాల మేరకు అదానీతో ఒప్పందాలు చేసుకుని స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు ఎక్కడ పెట్టినా అడ్డుకోండి, పగల కొట్టండి అని పిలుపిచ్చిన కూటమి పాలకులు నేడు నివాస గృహాలకు, వ్యాపార సంస్థలకు, పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు వేగంగా బిగించాలని ఆదేశాలివ్వడం చూస్తుంటే గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఏముందని అన్నారు. కొత్తగా బిగిస్తున్న మీటర్ల వల్ల ప్రజలు భరించలేని బిల్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలోనే 15,485 కోట్ల రూపాయలు సర్దుబాటు ఛార్జీలు వేయడాన్ని ఖండించారు. నేడు మరో మూడు రకాల సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. తక్షణం అదనంగా మోపిన సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రక్రియ పూర్తిగా ఆపేయాలని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కన్వీనర్ బి.అలమహారాజు, కె.జ్యోతిబసు, బాలం విజయ్ కుమార్, గొట్టుముక్కల శ్యామ్ బాబు రెడ్డి రామారావు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు 13 మంది ఎంపిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు అనూహ్య స్పందన లభించినట్లు శనివారం పరిశోధనా సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన డిబుల్ అగ్రి సైన్స్ ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు మొత్తం 41 మంది హాజరయ్యారని, వీరిలో వ్యవసాయ డిప్లొమా పూర్తి చేసిన వారేగాక ప్రస్తుతం డిప్లొమా చివరి సెమిస్టర్‌లో ఉన్నవారు కూడా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మొత్తం 13 మందిని ఫీల్డ్ అసోసియేట్లుగా ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారికి సంవత్సరానికి రూ.2.0 లక్షల వేతనం ఉంటుందని, అదనంగా డి.ఎ, హెచ్‌ఆర్‌ఎ, పిఎఫ్, ఇఎస్‌ఐ చెల్లిస్తారని తెలిపారు. త్వరలో వారికి నియామక పత్రాలు అందుతాయని తెలిపారు.

ఆహార పంటలను దెబ్బతీసేందుకే ప్రభుత్వాలు యత్నం

ప్రజాశక్తి - భీమవరం

ఆదాయం వచ్చే పంటలకు ప్రోత్సాహం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార పంటలను దెబ్బతీసి, వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పేందుకేనని కౌలు రైతుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత వ్యవసాయ చట్టాలను 2024 సెప్టెంబర్‌లో డిజిటల్ వ్యవసాయం పేరుతో అమలు చేసేందుకు పూనుకుందని తెలిపారు. దేశంలోని రూ.14 కోట్ల 57 లక్షలకు పైబడి రైతుల కమతాలు ఉంటే 2027 నాటికి చిన్న కమతాలుగా ఉన్న 11 కోట్ల 55 లక్షల రైతులను డిజిటల్ వ్యవసాయం పేరుతో కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని విదేశాలకు ఉపయోగపడేలా ఉద్యాన, వాణిజ్య పంటలను పండించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ విధానాలు అమలైతే దేశంలో తీవ్ర ఆహార కొరత వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల గౌరవం ఉంటే ప్రస్తుత గిట్టుబాటు ధరలకు అదనంగా రూ.500 బోనస్ కలిపి ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ రూ.20 వేల రూపాయలు, గత ఖరీఫ్ పంటకు దెబ్బతిన్న పంటనష్టం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

123 దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీత కులాలకు రిజర్వు చేసిన 5 మద్యం షాపులకు గానూ మొత్తం 123 దరఖాస్తులు దాఖలైనట్లు తణుకు ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలో షాపుకు 22 దరఖాస్తులు, తణుకు రూరల్ మండలానికి 34 దరఖాస్తులు, ఇరగవరం మండలానికి 35, పెనుగొండ మండలానికి 11, పెనుమంట్ర మండలానికి 21 దరఖాస్తులు దాఖలైనట్లు తెలిపారు. అప్లికేషన్ ఫీజుల ద్వారా రూ.2.46 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందన్నారు. ఎంపిక ప్రక్రియకు సంబంధించి ఈనెల 10న తేదీ ఉదయం 9.00 గంటలకు భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నరసాపురం: నరసాపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గీత కార్మికులకు కేటాయించిన 3 మద్యం షాపులకు శనివారం సాయంత్రం వరకూ 73 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు తెలిపారు. నరసాపురం రూరల్‌లో ఒక షాపునకు 18 దరఖాస్తులు, నరసాపురం టౌన్‌లో ఒక షాపునకు 18, మొగల్తూరు 1 షాపునకు 37 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటివరకు దరఖాస్తుల ఫీజు రూపంలో రూ.1.46 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. భీమవరం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో 10న ఉదయం 10 గంటలకు లాటరీ ద్వారా షాపులు కేటాయించనున్నట్లు తెలిపారు.

సీనియర్ న్యాయవాది రామారావు మృతికి సంతాపం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సీనియర్ న్యాయవాది, గవర్నమెంట్ మాజీ న్యాయవాది వీరవల్లి రామారావు (88) ఇటీవల మృతి చెందారు. శనివారం ఆయన మృతికి సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, జిల్లా సమితి సభ్యులు వైవి ఆనంద్, ఎం.లక్ష్మీపతి సంతాపం తెలిపి ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఆచంటలో రథోత్సవం

ప్రజాశక్తి - ఆచంట

భీష్మఏకాదశిని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా శనివారం జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం స్వామివారిని రథంపై పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ నంబూరు విజయ్ పాల్గొన్నారు.